క్లుప్తంగా

అభివృద్ధిలో దుబ్బాక మున్సిపాలిటీ ఆదర్శం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో దుబ్బాక మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 2వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ దుబ్బాక అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేశారని ఈ నిధులతో ప్రతీ వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోనెపల్లి దేవలక్ష్మిసంజీవరెడ్డి, కమిషనర్ గణేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

వర్గల్(గజ్వేల్): గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ జాలిగామ లతరమేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం వర్గల్ మండలం మజీద్‌పల్లిలో రూ.10లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బబ్బూరి లతశివరాములుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు చంద్రకళ, శంకర్, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

హుస్నాబాద్: రైతులకు నిరంతరం కరెంట్ అందించి ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు 24 గంటల కరెంట్ అందిస్తున్నామని ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తుందన్నారు. వరినాట్లు వేసి దాదాపు నెలరోజులు గడుస్తుందని ఈ సమయంలో వరిపంటకు కావాల్సిన నీళ్లు అందించాల్సి ఉంటుందన్నారు. అధికారులు స్పందించి కరెంట్ కోతలు లేకుండా చూడాలని కోరాడు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు సాయి, శ్రీనివాస్, సంజీవ్, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

పామాయిల్‌తో లాభాలు

దుబ్బాకరూరల్: రైతులు ఆయిల్ పంటలు సాగు చేయడంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని ఏఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్, రామక్కపేట గ్రామాల్లోని రైతులకు ఆయిల్ పామ్ తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఓ బాలాజీ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ తోటలను సాగు చేయడంతో పాటుగా అందులో అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం సబ్సిడీ, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. మండలంలో 320 ఎకరాల్లో ఆయిల్ పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజయ్య, పద్మప్రభాకర్, ఎంపీటీసీ శోభస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



బహుమతులను అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ అన్నారు. మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామంలో నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మంగళవారం పోటీల్లో గెలుపొందిన గజ్వేల్ టీమ్‌కు రవీందర్ రూ.15వేలు అందించారు. అలాగే బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కనకయ్య, మహిపాల్, కిరణ్, నాయకులు కృష్ణ, రాజిరెడ్డి, శ్రీకాంత్, గణేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరణపై హర్షం



బస్సును ప్రారంభిస్తున్న గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): కరోనా కాలం తర్వాత మిరుదొడ్డి మండలంలోని పలు గ్రామాలకు పూర్తి స్థాయిలో ఆర్టీసీ బస్సును నడపాలని కోరుతూ ఆర్టీసీ ఉన్నతాధికారులకు మిరుదొడ్డి మండల ప్రజాప్రతినిధులు ఇచ్చిన విజ్ఞప్తి మేరకు మంగళవారం అధికారులు బస్సును పునరుద్ధరించారు. దీంతో మిరుదొడ్డి గ్రామస్తులు స్వాగతిస్తూ ప్రజాప్రతినిధులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రాజు, ఎంపీటీసీ నర్సింహులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫహీం, మాజీ ఎంపీటీసీ స్వామి తదితరులు బస్సుకు పూజలు చేసి పునప్రారంభించారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మూడురోజుల పాటు కార్యక్రమాలు
- రామయ్య కల్యాణానికి ఘనంగా ఏర్పాట్లు



ముస్తాబైన సీతారామచంద్రస్వామి ఆలయం



శ్రీరాముడి పాదం ఆకారంలో కొలను

నంగునూరు(సిద్దిపేట): నంగునూరులోని తోకల కొండపై వెలసిన సీతారామచంద్రస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయ ఆవరణలో పాదం ఆకారంలో ఉన్న పవిత్ర గుండం, వేల సంవత్సరాల కిందట ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహాలు ఆలయ విశిష్టతకు ప్రతీకగా నిలుస్తున్నాయి. బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి కావడంతో ఆలయానికి కల్యాణ శోభ సంతరించుకుంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రోజువారీ కార్యక్రమాలు

మాఘ బహుళ పంచమి పురస్కరించుకొని ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు నగర సంకీర్తన, గణపతి, స్వస్తి పుణ్యాహవచనం, వేదపండితులతో అర్చన, అభిషేకం, గురువారం శకటోత్సవం, బండ్లు తిరుగుట, అర్చన, రంగరామానుజాచార్యతో సుదర్శన మహాయజ్ఞం, మంత్రపుష్పం, నామసంకీర్తన, బెజ్జంకి బృందంతో ఒగ్గు కథ, శుక్రవారం అర్చన, సామూహిక కుంకుమార్చన, 12.30 గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం, ప్రతి రోజు సాంస్కృతిక, ఒగ్గు కథాకాలక్షేపం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్ తెలిపారు.

ట్రాఫిక్ నియమాలతో ప్రమాదాల నివారణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీస్ అధికారులు

ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ట్రాఫిక్ నియమాలతో ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ సిగ్నల్, రోడ్డు నియమాలు, నూతనంగా సవరించిన ట్రాఫిక్ యాక్ట్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే రోడ్లపై, వాహనాల్లో ఎలా వెళ్లాలో, సిగ్నల్స్ ఎలా పాటించాలో అవగాహన ఉండాలన్నారు. ఫోర్ వీలర్‌లో వెళ్లినప్పుడు విధిగా సీట్ బెల్టు ధరించాలని, టూ వీలర్‌లో వెళ్లినప్పుడు హెల్మెట్ పెట్టుకోవడం వంటి నియమాలు విధిగా పాటించాలన్నారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, తనిఖీల్లో దొరికితే వాహనాల యజమానులకు శిక్ష పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నియామకపత్రం అందిస్తున్న పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీజేపీ సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శిగా పెంబర్ల యాదగిరి యాదవ్‌ను, పట్టణ కార్యదర్శిగా భోగి శ్రీనివాస్‌లను నియమిస్తూ మంగళవారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్ నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్‌రావు, శివకుమార్, జనార్దన్, అరుణారెడ్డి, యాదన్‌రావు, వేణు, కృష్ణ, ఎం.డీ.యాసిన్, లక్ష్మి పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ శక్తి కేంద్ర ఇన్‌చార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 10 నుంచి 25వ తేదీవరకు జరిగే శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులుగా గాదాసు రాంప్రసాద్, తగరం లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు, బీజేపీ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే..

అక్కన్నపేట(హుస్నాబాద్): తెలంగాణలో బీజేపీకి మంచి భవిష్యత్ ఉందని బీజేపీ హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, మండల ఇన్‌చార్జి జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో మంళవారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు వీరాచారి ఆధ్వర్యంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి విజయపాల్ రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూనావత్ మోహన్‌నాయక్, అసెంబ్లీ కో-కన్వీనర్ జనగామ వేణుగోపాల్‌రావు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాక: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు మాదాస్ వెంకట్‌గౌడ్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు విభీషణ్‌రెడ్డి, రాజాగౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యం, మండల ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నాయకులు స్వామి, నర్సింహులు, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన బీఆర్‌ఎస్వీ నాయకులు



మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ప్రతినిధులు మంగళవారం ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జిల్లా అధ్యక్షుడు మహేష్, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో కలిసి అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రూపొందించిన బడ్జెట్‌పై అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రికి పూలమొక్క ఇచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, యాదగిరి, శ్యామ్, రమేశ్, అరవింద్ తదితరులు ఉన్నారు.

పొట్లపల్లి హుండీ ఆదాయం రూ.9.58లక్షలు



హుండీ లెక్కిస్తున్న మహిళలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ ధర్మదాయశాఖ సిద్దిపేట డివిజన్ పరిశీలకుడు వి.రంగారావు సమక్షంలో మంగళవారం లెక్కించినట్లు ఇంచార్జి ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు. 16 మార్చి 2022 నుంచి 07 ఫిబ్రవరి 2023 వరకు 329 రోజుల హుండీ ఆదాయం రూ.9,58,543లు వచ్చాయి. వీటిని బ్యాంక్ ఖాతాలో జమచేసినట్లు ఈఓ వివరించారు. మహాశివరాత్రి జాతర పురస్కరించుకొని ఆలయ అవరణలో దుకాణాల సముదాయాలకు వేలం పాట చేపట్టారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి



ప్రశంస పత్రాలు, బహుమతులతో విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమష్టి కృషితో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ గజ్జెల సాయిలు, డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ పంచాయతీ మధిర గ్రామం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎర్త్ (ఎడ్యుకేషన్ ఆర్ట్ హెల్త్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లులకు మంగళవారం మదర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇటీవల ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 26 అంశాల్లో విద్యార్థులకు హుస్నాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 11 అంశాల్లో బహుమతులు కైవసం చేసుకున్న ఆరెపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రశంస పత్రాలతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు రాష్ట్ర స్థాయిలో కూడా గుర్తింపు తెచ్చిన పాఠశాల హెచ్‌ఎం భాగ్యలక్ష్మికి గ్రామస్తులు సహాయ సహకారాలు అందించడం అభినందించదగిన విషయమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాలకు మైక్ సౌండ్ కోసం డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య రూ.10వేల విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కొత్త రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు లింగం, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, సర్పంచ్ రంగనబోయిన రాములు, ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ రాజు, విద్యా కమిటీ సభ్యులు రాజు, అర్జున్‌రావుతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా..



మాట్లాడుతున్న రాధాకృష్ణశర్మ, జెడ్పీ చైర్‌పర్సన్, నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షకు ప్రతిబింబంగా ఉందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్‌లు అన్నారు. మంగళవారం చిన్నకోడూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమంతో పాటు అన్ని రంగాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పించినట్లు చెప్పారు. బడ్జెట్‌లో అన్నిరంగాలకు తగిన ప్రాధాన్యం లభించిందన్నారు. ప్రస్తుతం మన రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్‌లు కనకరాజు, సదానందం, రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గజ్వేల్‌రూరల్: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులను తెస్తూ సీఎం కేసీఆర్ గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్లో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీర, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు మంగళవారం స్థానిక కౌన్సిలర్ భాగ్యలక్ష్మిదుర్గాప్రసాద్‌తో కలిసి భూమిపూజ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ విద్యాధర్‌తో పాటు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

‘మాయమాటలతో మోసం చేస్తున్న బీఆర్‌ఎస్’



పాదయాత్రలో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ అని, మాయమాటలతో ప్రజలను మోసం చేస్తూ బీఆర్‌ఎస్ పబ్బం గడుపుతుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడోయాత్ర మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లిలో మంగళవారం ఏడోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే నాయకులకు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. నాడు నిర్మించిన భవనాలకు సున్నం వేయలేని దుస్థితిలో నాయకులు ఉన్నారని మండిపడ్డారు. అసంపూర్తి భవనాలు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి అక్రమాలతో పాలన సాగిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఇన్‌చార్జి డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని గుండారంలో మంగళవారం రెండోరోజు గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, కొమురయ్య, నర్సయ్య, డీవీరావు, రవి, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రమాబాయికి నివాళి

హుస్నాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దళిత, బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సంపత్‌కుమార్, శంకర్, సుధాకర్, గడిపె కొమురయ్య, రాజు, వెంకట్, శరత్, వినోద్‌కుమార్, దేవేందర్ పాల్గొన్నారు.

◆ అన్ని వర్గాలకు ప్రయోజనం

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. మంగళవారం పాలమాకులలో బీఆర్‌ఎస్ నాయకులతో కలసి సారయ్య విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ అత్యధిక నిధులు కేటాయించి రైతు ప్రభుత్వంగా నిలిచిందన్నారు. ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇళ్ల నిర్మాణం, విద్య, వైద్య రంగాలకు ప్రయోజనం చేకూరుస్తూ ప్రజారంజక బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి, మల్లయ్య, రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ కుమారస్వామి, ఎంపీటీసీ తిరుపతి, కృష్ణారెడ్డి, నాగేంద్రం, వేణుచక్రవర్తి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

◆ క్రిస్టియన్లకు అండగా ప్రభుత్వం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): క్రిస్టియన్లకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని, క్రిస్మస్‌ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం సిద్దిపేట గాడ్ విజన్ సంస్థ 2023 కేలండర్‌ను ఎమ్మెల్సీ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు సికిందర్, కార్యవర్గ సభ్యులు జాషువా, పాల్, జోషి, మోసెస్, సాగర్, ముఖ్య సలహాదారు రాజారత్నం, పాస్టర్లు కాలేబు, సీమోను, రంగరాజు, ప్రేమ్‌చంద్, ప్రభాకర్, తీమోతి, తదితరులు పాల్గొన్నారు.

◆ సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

హుస్నాబాద్: గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశాడు. సంత్ సేవాలాల్ 284వ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించాడు. ఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో జయంతి సందర్భంగా సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

◆ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లదేనని ఎంవీఐ నరేంద్రనాయక్, గజ్వేల్ ఎస్‌ఐ నరేశ్‌లు పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల జీపీపీ ఆర్టీసీ డిపోలో మంగళవారం ప్రైవేట్ డ్రైవర్లకు శిక్షణలో భాగంగా ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్సులను నడిపే సమయంలో డ్రైవర్లు ఏకాగ్రతతో ఉండాలని, సెల్‌ఫోన్ మాట్లాడవద్దన్నారు. ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నెమ్మదిగా వెళ్లాలని, అతి వేగం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో జీపీపీ డిపో మేనేజర్ సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

◆ భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రాజనర్సు, వేణుగోపాల్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు గుండ్ల చెరువు వద్ద సిద్దిపేట రూరల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్, పారాబాయిల్డ్ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణానికి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మంత్రి ఓఎస్డీ బాల్‌రాజు, కౌన్సిలర్ చంద్రం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, యూనియన్ అధ్యక్షుడు యాదగిరి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

◆ ముగిసిన పెద్దమ్మ ఉత్సవాలు



ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు

నంగునూరు(సిద్దిపేట): మైసంపల్లిలో జరుగుతున్న పెద్దమ్మ ఆలయ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సారయ్య, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, తిరుపతి, మల్లయ్యతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రత్యేక పూజలు నిర్వహించగా వారిని శాలువాతో సత్కరించారు. ఉత్సవాలు చివరిరోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి పూజలు చేశారు.

◆ మహిళలు వ్యవసాయ రంగంలో రాణించాలి



క్షేత్ర స్థాయిలో పంటల సాగును పరిశీలిస్తున్న మహిళా రైతులు

దుబ్బాక: మహిళలు అధునాతన పద్ధతులతో పంటలు పండించి వ్యవసాయ రంగంలో మహిళలు రాణించాలని సెహగల్ ఫౌండేషన్ ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ పేర్కొన్నారు. సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దౌల్తాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం మహిళా రైతులతో కలిసి పంటల సాగుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆధునాతన పద్ధతులతో చేపట్టిన కూరగాయల సాగును ఆసక్తిగా పరిశీలించారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, లారెన్స్, అబ్రహం, కాసిం వలి, సాయి సరస్‌తో పాటు దౌల్తాబాద్, చేగుంట, మనోహరాబాద్ మహిళా రైతులు పాల్గొన్నారు.

◆ మొగి పురుగు నివారణకు చర్యలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వరిలో మొగి పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఓ వసంతరావు అన్నారు. మంగళవారం చిన్నకిష్టాపూర్ గ్రామంలో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు యాసంగి వరి పంటల్లో మొగి పురుగు నివారణకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులను పిచికారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకయ్య, రైతులు పాల్గొన్నారు. మర్కూక్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఏఓ నాగేందర్‌రెడ్డి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు మొగి పురుగు నివారణకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

◆ వెదజల్లే పద్ధతిలో సాగుతో మేలు

కొండపాక(గజ్వేల్): వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పంటలను మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మండలంలోని మేథినీపూర్‌లో రైతు లష్కర్ కృష్ణ వెదజల్లే పద్ధతిలో సాగుచేసిన వరిపైరును గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ పరిశీలించిన అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బాబునాయక్ మాట్లాడుతూ.. వెదజల్లే పద్ధతిలో పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ప్రియదర్శిని, ఏఈవో స్వప్న, రైతులు పాల్గొన్నారు.

◆ బీసీ సంక్షేమ సంఘం హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా సంతోష్

హుస్నాబాద్: బీసీ సంక్షేమ సంఘం హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా వెల్దండి సంతోష్‌ను నియమించినట్లు సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చొక్కాచారి, వరయోగుల అనంతస్వామి, రాజేందర్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన



ఉపాధ్యాయులతో విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నాచారం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పి సరికొత్త అనుభూతి పొందారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు హెచ్‌ఎం శంకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

‘విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు’

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం పట్టణ కేంద్రంలో ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన 2023-24 బడ్జెట్ రూ.2,90,396 కోట్లల్లో కేవలం రూ.19,093కోట్లు (6.57శాతం) మాత్రమే విద్యారంగానికి కేటాయించడం అన్యాయమన్నారు. గతంలో కేటాయించిన 7.30శాతం కంటే తగ్గింపు చేయడం దారుణమన్నారు. మొత్తం బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ సవరణ చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు శివతేజ, నాయకులు సిద్దార్థ్, రాకేశ్ పాల్గొన్నారు.